

# మంచిర్యాలను ముంచెత్తిన వరద..

- అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్..
- సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు..

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంచిర్యాలను వరద ముంచెత్తుతున్నది. వరద పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరం, మాతా శిశు హాస్పిటల్ పరిసరాలను కలెక్టర్ ఆర్ఐ శిరీషతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షపాతం కారణంగా గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతోందని, ప్రజల రక్షణ కోసం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం జిల్లా సమీకృత కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టును తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండేతో కలిసి పరిశీలించారు. వరద ఇన్‌ఫ్లో అధికంగా ఉన్నందున అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా తొలగిస్తూ దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, దోమల మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ముల్కల వద్ద గోదావరి నది తీరాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**మాతా శిశు కేంద్రం నుంచి గర్భిణుల తరలింపు**

గోదావరి నది వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో మాతా శిశు సంరక్షణా కేంద్రంలో ఉన్న గర్భిణులు, బాలింతలను ముందస్తుగా జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులకు తరలించారు. ఈ కేంద్రం మంచిర్యాల గోదావరి ఒడ్డున ఏర్పాటు చేయబడింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో ఉన్నందున, వరదలు పెరగడం వల్ల కేంద్రం మునిగే ప్రమాదం ఉందని అధికారులు గుర్తించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 40 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నందున, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వరద ప్రవాహం కొనసాగుతోంది. పై నుంచి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యం లో, మాత శిశు ఆసుపత్రిలో ఉన్న వారిని స్వచ్ఛందంగా మంచిర్యాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అధికారులు తెలిపారు, ఎల్లంపల్లి గేట్లు పూర్తిస్థాయిలో ఎత్తినప్పుడు వరద ప్రవాహం నేరుగా కేంద్ర భవనంలోకి చేరే ప్రమాదం ఉంది, అందువల్ల ముందస్తు భద్రత చర్యలు అవసరమైందని.



**దెబ్బతిన్న పంటలు**

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జైపూర్ మండలంలోని వేలాల, పొన్నూరు గ్రామాల రైతుల పత్తి, వరి పంట పొలాలు మునిగిపోగా, వారు తీవ్ర నష్టాన్ని భోగుతున్నారు. బీజెపి చెన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి, బీజెపి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ తెలిపారు, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎకరానికి 50,000 రూపాయల నష్టపరిహారం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ప్రకటించినప్పటికీ అవి విఫలమై రైతులకు రక్షణ లభించలేదని, కనీసం ఈసారి రైతులను ఆదుకునే విషయంలో ముందంజలో ఉండాలని ఆకాంక్ష చేస్తున్నారు. రైతుల సమస్యలను చూస్తూ, బీజేపీ నేతలు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజెపి జైపూర్ మండల్ ఉపాధ్యక్షులు వేముల రమేష్ గౌడ్, ప్యాగ లవ్ కుమార్, మండల్ ప్రధాన కార్యదర్శి రామగిరి రాము, కోశాధికారి పెనుకుల శ్రీకాంత్, బీజేవైఎం మండల అధ్యక్షులు పల్లికొండ వెంకటేష్, వేల గ్రామం అధ్యక్షులు ప్యాగ మొగిలి, ప్యాగ చందు, రైతులు ప్యాగ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

**శ్రీపాద ఎల్లంపల్లికి వరద హెచ్చరిక**

- ఎల్లంపల్లి 38 గేట్లు ఎత్తివేత..
- 5.61 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, కడెం ప్రాజెక్ట్ గేట్లు తెరచి నీటిని విడుదల చేయడంతో పాటు కురిసిన వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో వరద ముప్పు పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లను మరింత ఎత్తి రోజుకు దాదాపు ఆరు నుంచి ఏడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే అవకాశముందని అధికార వర్గాలు సూచించాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టేందుకు లేదా పశువులు, గొర్రెలతో నది ఒడ్డులకు వెళ్లరాదని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూచించారు. అలాగే రైతులు, గొర్రెకాపరులు నది దాటి ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.












## భారీ వర్షా ల దృష్ట్యా ప్రజల రక్షణకు చర్యలు

- వరద ఉధృతి పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

భారీ వర్షాల కారణంగా ప్రజల రక్షణకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం ఆయన గోదావరి నది వరద ఉధృతిని ఎంపీడీసీఎల్ ఎస్ఈతో కలిసి పరిశీలించారు. అనంతరం మాత శిశు ఆసుపత్రిని సందర్శించి గర్భిణులు, చిన్నపిల్లల సంరక్షణ పరిస్థితులను పరిశీలించారు.కలెక్టర్ వివరాల ప్రకారం, ఎస్ఆర్ఎస్‌పి నుంచి 3 లక్షల క్యూసెక్కులు, కడెం నుంచి 50 వేల క్యూసెక్కుల వరద నీరు విడుదల కావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో పెరిగింది. ఈ నేపథ్యంలో గర్భిణులు, పిల్లలను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 139 మంది రోగులు సేవలు పొందుతున్నారని చెప్పారు.జన్నారం, దండేపల్లి, భీమిని, తాండూర్, కోటపల్లి మండలాల్లో అధిక వర్షపాతం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాసం కల్పించామని కలెక్టర్ తెలిపారు. వాగులు, నదుల వద్ద ప్రజలు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాత మంచిర్యాలలోని ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## సామాజిక సేవలో ముందుంటున్న అంజనీ పుత్ర

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ఎల్లప్పుడూ సామాజిక సేవలో అంజనీ పుత్ర సంస్థ ముందుంటుందని అంజనీ పుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి అన్నారు. గురువారం మంచిర్యాలలో అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాల్లో మొదటి రోజున 2 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో అంజనీ పుత్ర అన్నదాన కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. దాదాపు వినాయక ప్రతిమ ప్రతిష్ఠించిన ప్రతిచోటా అన్నదానం తప్పనిసరయింది జనాభా సంకు అనుగుణంగా భారీగానే అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం లో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లుసూరినేనీ కిషన్, కాసర్ల సదాందం, డైరెక్టర్ లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, నాణ్యత సమన్వయకర్తలతో కలిసి మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పాటించాలి. మౌలిక సదుపాయాలు, మెనూ ప్రకారం పోషకాహారం అందించడం, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ, విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరి గోడలు వంటి పూర్తి సదుపాయాలు కల్పించడం ముఖ్యం. ప్రతి విద్యార్థికి సరైన విద్యా వసతులు ఉండేలా పర్యవేక్షించాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతకు అవగాహన కల్పించాలి. అవసరమైన క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అతను ఉపాధ్యాయులకు డైరీ ద్వారా రోజువారీగా నవీకరణలు ఇవ్వడం, విద్యార్థుల ప్రగతి, ప్రతిభ ఆధారంగా పాఠశాలల పనితీరును అంచనా వేయడం, మండల విద్యాధికారులు పాఠశాలలను సందర్శించి సమస్యలు పరిష్కరించడం, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా హాజరు, ఉపాధ్యాయుల సమయ పాలన, పాఠశాల వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించడం అవసరమని సూచించారు. వీటితో పాటు వెనుకబడిన విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని, వచ్చే నెలలలో పాఠశాలల్లో మెరుగైన చదువుతీరు సాధించడానికి అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు.



## నకిలీ జర్నలిస్టుల అరెస్ట్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జర్నలిస్టుల పేరుతో నకిలీ ఐడీలు తయారు చేసి వ్యాపారులను బెదిరిస్తున్న ఇద్దరిని మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.టౌన్ ఎస్ఐ మజారోద్దీన్ వివరాల ప్రకారం, ఆర్పీ రోడ్‌లోని శ్రీ సాయి శ్రీనివాస బార్‌లో సయ్యద్ సిరాజ్ మద్యం తాగి ఉచితంగా బిర్యానీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే మీడియాను పిలిపించి సమస్యలు సృష్టిస్తానని హెచ్చరించాడు.దర్యాప్తులో ఎల్ఐసీ కాలనీకి చెందిన బండి కిరణ్, వీ6 పేరిట నకిలీ ఐడీ కార్డు సిరాజ్‌కు ఇచ్చినట్లు బయటపడింది.



ఈ ఇద్దరూ కొంతకాలంగా "ప్రెస్" ముసుగుతో వ్యాపారులను బెదిరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.కోర్టులో హాజరైన వారికి మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా, వారిని లక్షెట్టిపేట జైలుకు తరలించారు. నకిలీ జర్నలిస్టుల ముఠాలు మీడియా ప్రతిష్ఠకు ముప్పుగా మారుతున్నాయని మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

## మానేరు డ్యామ్ గేట్లు ఎత్తే అవకాశం

- ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

లోయర్ మానేరు డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, మిడ్ మానేరు రిజర్వాయర్ నుండి వచ్చిన వరద కారణంగా ప్రాజెక్టులో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రేపు 29 ఆగస్టు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య స్పిల్వే వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన మానేరు నది పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు, సామాన్య ప్రజలు నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ హెచ్చరికలు మానేరు నదికి వరదలు ఉన్నంతకాలం, అంటే అక్టోబర్ చివరి వరకు అమల్లో ఉంటాయని న స్పష్టం చేశారు.